# రూ.3.14 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి -ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సంయుక్త పర్యటనలో
- ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందడి
- దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో విస్తృత పర్యటన
- సీసీ రోడ్లు, వీఓ భవనం, బోర్‌వెల్‌ల ప్రారంభోత్సవాలు
- కొత్త అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



- ప్రజల సమస్యలను నేరుగా విని అధికారులకు కీలక ఆదేశాలు

2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 19 | జులై | 2026 ◆ పేజీలు : 7

- జూలై 3నే కేసు మొదలైందా..? లేక అప్పుడే మరో పరిణామానికి తెర లేచిందా..?
- ఫిర్యాదు నమోదు కాక ముందు జరిగిన ప్రతి పరిణామంపై ఇంకా ప్రశ్నలే..!
- మధ్యలో జరిగిన సంప్రదింపులు, స్టేషన్‌లో జరిగిన చర్చలపై స్పష్టత ఎక్కడ..?
- మధ్యవర్తుల ప్రమేయం గురించి పోలీసుల వద్ద నిజంగా ఆధారాలు లేవా..?
- నిజంగా 11 వ తారిఖు కంటే ముందు ఈ విషయం పోలీసులకు తెలియదా..?
- ప్రెస్ మీట్‌లో చెప్పిన వివరాలకు ముందు జరిగిన కాలక్రమం ఏమిటి..?
- సీసీటీవీ, సీడీఆర్, స్టేషన్ రికార్డులు అసలు నిజాన్ని చెబుతాయా..?
- పూర్తి టైమ్‌లైన్‌ను బయటపెట్టాలని ప్రజల డిమాండ్..!




7 లో..

## 2 టౌన్ స్టేషన్ సాక్షిగా...

# అసలేం జరిగింది..?

జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కొత్తగూడెం టూ టౌన్ పోక్సో కేసు రోజురోజుకూ కొత్త ప్రశ్నలకు దారితీస్తోంది. బాధితురాలి తల్లి ఫిర్యాదు ఆధారంగానే కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టామని పోలీసులు చెబుతున్నప్పటికీ, ఫిర్యాదు నమోదుకు ముందు జరిగిన పరిణామాలపై మాత్రం ఇంకా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, పోక్సో చట్టం ప్రకారం చిన్నారిపై జరిగిన లైంగిక నేరాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం, రాజీకి ప్రయత్నించడం లేదా న్యాయ ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలు కూడా చట్టపరమైన పరిణామాలకు దారితీయవచ్చని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# సీపీఐ కార్పొరేటర్ బీజేపీలోకి..?



కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్ కార్పొరేటర్ పగడాల ఆకాంక్ష తన తండ్రితో కలిసి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కుటుంబ సభ్యులను కలిసిన సందర్భంగా..

- కొత్తగూడెం రాజకీయాల్లో కొత్త చర్చ..
- 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకాంక్ష పార్టీ మారతారనే సంకేతాలు..
- వైరల్‌గా మారిన ఫొటోతో ఊపందుకున్న ప్రచారం..!
- అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 18, ప్రజా జ్యోతి :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయాల్లో మరోసారి పార్టీ మార్పుల చర్చ జోరందుకుంది. కార్పొరేషన్ 11వ డివిజన్‌కు చెందిన సీపీఐ కార్పొరేటర్ పాడాల ఆకాంక్ష భారతీయ జనతా పార్టీలో చేరనున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ఇటీవల ఆమె బీజేపీ

మిగతా 2 లో...

# దమ్మపేటలో అసైన్డ్ భూమి అక్రమాలపై కలెక్టర్ కొరడా..!

- తహశీల్దార్ రామ్ నరేష్, జీపీఓ అనంతమ్మ సస్పెన్షన్
- బతికున్న వ్యక్తిని మృతుడిగా చూపించి రెవెన్యూ రికార్డుల తారుమారు..
- ఆర్డీవో విచారణలో అవకతవకలు వెల్లడి



**దమ్మపేట, జూలై 18(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలో అసైన్డ్ భూమి రికార్డుల తారుమారుపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. పెద్దగొల్లగూడెం రెవిన్యూ గ్రామంలోని ఐదు ఎకరాల అసైన్డ్ భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను అక్రమంగా మార్చిన ఆరోపణలు రుజువుకావడంతో

మిగతా 2 లో...

## అణచివేతలకు వ్యతిరేకంగా

# గిరిజనులు ఐక్యంగా పోరాడాలి

- ఉపాధి హామీని నిర్వీర్యం చేయొద్దు..
- పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి
- టీజీఎస్ రాష్ట్ర మహాసభల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**పాల్వంచ, జులై 18, ప్రజా జ్యోతి :** గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం.. అణచివేతలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్మించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సమాఖ్య (టీజీఎస్) రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా పాల్వంచలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అడవిపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులపై అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. గిరిజనుల సమస్యలపై

మిగతా 2 లో...

## దమ్మపేటలో అసైన్డ్ భూమి అక్రమాలపై కలెక్టర్ కొరడా..!

(మొదటి పేజీ తరువాయి...)

దమ్మపేట తహశీల్దార్ కె. రామ్ నరేష్, పెద్దగొల్లగూడెం గ్రామ పరిపాలన అధికారి (జీపీఓ) వి. అనంతమ్మలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే... పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన మళ్లా సత్యం జీవించి ఉండగానే ఆయన మరణించినట్లు అధికారిక రికార్డుల్లో నమోదు చేసినట్లు విచారణలో తేలింది. అంతేకాకుండా ఆయనకు నలుగురు సంతానం ఉన్నప్పటికీ, ఒక్క కుమార్తె నామా పుష్పావతినే కుటుంబ సభ్యురాలిగా పేర్కొంటూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ ధ్రువీకరణ పత్రాన్ని ఆధారంగా చేసుకుని గ్రామంలోని సర్వే నంబర్ 385/54లో ఉన్న ఐదు ఎకరాల అసైన్డ్ భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను మార్పులు చేసి, సక్సెషన్ (వారసత్వ) మాడ్యూల్ ద్వారా పట్టాదార్ పాస్‌బుక్ జారీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో జిల్లా కలెక్టర్ అంకిత్, కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) మధును విచారణ అధికారిగా నియమించి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. రికార్డులు, సంబంధిత పత్రాలు, క్షేత్రస్థాయి అంశాలను పరిశీలించిన ఆర్డీవో తన నివేదికలో రెవెన్యూ రికార్డుల నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని, నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్డీవో నివేదికను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్, తహశీల్దార్ రామ్ నరేష్ , జీపీఓ అనంతమ్మలపై ప్రాథమికంగా ఆరోపణలు రుజువయ్యాయని నిర్ధారించి ఇద్దరినీ తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఈ ఘటన జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రెవెన్యూ రికార్డుల తారుమారు, నకిలీ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా భూముల బదిలీ వంటి అక్రమాల విషయంలో ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఎలాంటి రాజీ పడబోదని, బాధ్యులపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## సీపీఐ కార్పొరేటర్ బీజేపీలోకి..?

(మొదటి పేజీ తరువాయి...)

ఎంపీ ఈటల రాజేందర్ కుటుంబ సభ్యులను కలిసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ సమావేశానికి సంబంధించినట్లు చెబుతున్న ఒక ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, ఆమె బీజేపీలో చేరడం ఖాయమనే ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. ఇప్పుడు ఈ పరిణామం కొత్తగూడెం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. సీపీఐ నుంచి ఎన్నికైన కార్పొరేటర్ బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారనే ప్రచారం నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు కూడా పరిస్థితిని ఆసక్తిగా గమనిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు కార్పొరేటర్ ఆకాంక్ష నుంచి గానీ, బీజేపీ నాయకత్వం నుంచి గానీ పార్టీ మార్పుపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాకపోతే ఫొటో వైరల్ కావడంతోనే ఈ ప్రచారం మొదలైందా? లేక త్వరలోనే అధికారికంగా చేరిక ఉండబోతుందా? అనే చర్చ స్థానిక రాజకీయాల్లో కొనసాగుతోంది. ఒకవేళ పార్టీ మార్పు అధికారికంగా జరిగితే కొత్తగూడెం కార్పొరేషన్ రాజకీయ సమీకరణాలపై కూడా దాని ప్రభావం ఉండే అవకాశముందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం మాత్రం వైరల్ ఫొటో, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారమే ఈ చర్చకు కారణమవుతుండగా, అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

## ప్రభుత్వ అంచనాల కమిటీ చైర్మన్ గా కోరం



**ఇల్లందు, జులై 18 (ప్రజా జ్యోతి)**
తెలంగాణ రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ గా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ను శనివారం రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ నియామకం పట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, నాయకులు, పుర ప్రముఖులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రూ.3.14 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం





**అశ్వారావుపేట/దమ్మపేట, జూలై 18(ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి మరో భారీ అడుగు పడింది. ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ సంయుక్తంగా దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో విస్తృతంగా పర్యటించి రూ.3 కోట్ల 14 లక్షల 50 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించిన ప్రజాప్రతినిధులు ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా నారవారిగూడెం కాలనీ, అల్లిగూడెం, ఊట్లపల్లి, మల్లాయగూడెం, అనంతారం, గాండ్లగూడెం, జెట్టివారిగూడెం, కొత్తూరు, మామిళ్లవారిగూడెం, పాకలగూడెం, అసుపాక గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గుమ్మడివల్లి గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి నిర్మించిన వీఓ భవనంతో పాటు సీసీ రోడ్డును ప్రజలకు అంకితం చేశారు. అసుపాక గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్‌వెల్ను ప్రారంభించి వినియోగానికి అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం అశ్వారావుపేటలో నిర్మాణంలో ఉన్న కొమరం భీమ్ ఎకో పార్క్ పనులను పరిశీలించి, పర్యాటకులను ఆకర్షించే విధంగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం రమణక్కపేట గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి, తోగ్గూడెం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోర్‌వెల్ నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపనలు నిర్వహించారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకున్న ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడిన ఎంపీ, ఎమ్మెల్యే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించగలిగే ఒక్క పనినీ పెండింగ్‌లో ఉంచవద్దని, ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ... ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ, "ప్రజలు కోరుకున్న అభివృద్ధిని గ్రామాల గడప వరకు తీసుకెళ్లాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, మహిళా సంఘాలకు సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా అవసరమైన నిధులను తీసుకురావడం నా బాధ్యత. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండకూడదు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి పనిని నిర్ణీత గడువులో పూర్తి చేయాలి. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వెంటనే పరిష్కరించడమే మా లక్ష్యం." అని అన్నారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ... అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, "అశ్వారావుపేట నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే మా సంకల్పం. ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీలు, విద్యుత్, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రజలు ఏ సమస్యతో వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించేలా అధికారులను ఆదేశించాం. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు కొత్త అభివృద్ధి పనులకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటిస్తూ వారి సమస్యలను స్వయంగా తెలుసుకుంటున్నాను. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరే వరకు మా కృషి నిరంతరం కొనసాగుతుంది." అని తెలిపారు.

### అధికారులకు కీలక ఆదేశాలు

ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలని, స్థానికంగా పరిష్కరించగలిగే పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచవద్దని ఎంపీ, ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చి వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నశెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తుమ్మా రాంబాబు, కోల లక్ష్మీనారాయణ, తహసీల్దార్, ఎంపీడీవో రామకోటి రెడ్డి, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అణచివేతలకు వ్యతిరేకంగా
# గిరిజనులు ఐక్యంగా పోరాడాలి

(మొదటి పేజీ తరువాయి...)

రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, విద్య, వైద్య సేవలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో గిరిజన విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదని విమర్శించారు. గిరిజన సబ్‌ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం నిలిపివేసి, జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టం-2006ను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. గ్రామీణ పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ఉపాధి హామీ నిధులను తగ్గించడం



వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పెరిగే ప్రమాదం ఉందని, పనిదినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో గిరిజనుల హక్కుల సాధన కోసం మరింత బలమైన ఉద్యమాలు చేపడతామని, దేశవ్యాప్తంగా ఆదివాసీలను ఏకం చేసి జాతీయ స్థాయిలో పోరాటాలు నిర్మిస్తామని కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తి నాయక్, రాష్ట్ర కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, నారాటి ప్రసాద్, సరిరెడ్డి పుల్లారెడ్డి, ఎస్‌డీ సలీం, సలిగంటి శ్రీనివాస్, మున్నాలక్ష్మీకుమారి, జిల్లా నాయకులు, గిరిజన సమాఖ్య ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వంద పడకల వైద్యశాలతో ప్రజలకు మరింత వైద్య సేవలు

- వైద్యశాలలో అంబులెన్స్, ఐసియు, సిటీ స్కాన్ ఏర్పాటుకు కృషి
- పిహెచ్సి ల ఏర్పాటుకు మంత్రి సానుకూలత
- ప్రభుత్వ వైద్యశాలలోనే నాణ్యమైన ఉచిత వైద్యం: ఎమ్మెల్యే






**ఇల్లందు, జులై 18 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇల్లందులో నిర్మాణం జరుగుతున్న వంద పడకల వైద్యశాలతో ప్రజలకు మరింత వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. శనివారం నిర్మాణ దశలో ఉన్న వంద పడకల వైద్యశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో అంబులెన్స్, ఐసియు, సిటీ స్కాన్ ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిదంగా గ్రామాల్లో పిహెచ్సి ల ఏర్పాటుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ దామోదర రాజ నర్సింహ సానుకూలంగా ఉన్నట్టు తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలోనే ప్రతి ఒక్కరికి నాణ్యమైన ఉచిత వైద్యం అందుతుందన్నారు. వైద్యశాల నిర్మాణ పనులను కాంట్రాక్టర్ వేగంగా పనులు పూర్తి చేయడం జరుగుతుందని, నిర్మాణం పూర్తి నాణ్యతతో చేపడుతున్నట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో ఇల్లందు వంద పడకల వైద్యశాలను నిర్మాణాన్ని పూర్తిచేసుకోని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇల్లందు, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి, కారేపల్లి, కామేపల్లి, గార్ల, బయ్యారం మండల ప్రజల అవసరాల నిమిత్తం వంద పడకల వైద్యశాల మరింత ఉపయోగపడుతుందని తెలిపారు. గార్ల మండలం నుండి ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు నిత్యం రోగులు చికిత్స నిమిత్తం రావడం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతమైన ఇల్లందులో వంద పడకల వైద్యశాల నిర్మించడం సంతోషకరమన్నారు. నూతన 100 పడకల వైద్యశాలలో కంటి సంబంధిత వైద్యం మినహాయించి అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలో పిహెచ్సిలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కోరడంతో అటు ప్రభుత్వం ఇటు మంత్రి పీహెచ్సీల ఏర్పాటుకు సిద్ధంగా ఉందన్నారు. ఇల్లందులో నిర్మిస్తున్న వంద పడకల వైద్యశాల పనులు ఎక్కడి వరకు వచ్చాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి అడగడం జరిగిందని గుర్తు చేశారు. జిల్లాలో అత్యధికంగా ఓపి, ఎమర్జెన్సీ ఓపీలు ఇల్లందులోనే సగటున 600నమోదు అవుతున్నాయన్నారు. అనంతరం డిసిహెచ్ఎస్ డాక్టర్ జి.రవిబాబు మాట్లాడుతూ 2022లో సిహెచ్సి లు వచ్చినప్పటికీ మన జిల్లాలోనే ప్రభుత్వ వైద్యశాలలో మరింత అభివృద్ధి చెందుతున్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకొని ప్రభుత్వ వైద్యశాలకు అంబులెన్స్, ఐదు పడకల ఐసీయూ, సిటి స్కాన్ ఏర్పాటు చేయాలని కోరగా, ఇల్లందు తోపాటు గిరిజన ఏరియాలలోని సిహెచ్సి లలో సిటీ స్కాన్ ఏర్పాటు చేయాలని మంత్రి అన్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని సూచించినట్లు తెలిపారు. కంటి సంబంధిత వైద్యం కోసం తాము కృషి చేయడం జరుగుతుందని, నూతన వంద పడకల వైద్యశాలలో పీడియాట్రిక్ (చిన్నపిల్లల) ఐసీయూ అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఇల్లందు నుండి వేరే ప్రాంతాలకు రోగులు వైద్యం కోసం వెళ్లకుండా పూర్తి నాణ్యమైన, ఉచిత వైద్యం అందించేందుకు తాము నిరంతరం కృషి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. గతంలో ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో ఐదు డయాలసిస్ బెడ్స్ ఉండేవని, ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో మరో మూడు బెడ్స్ ఏర్పాటు చేయడం వల్ల, సమయం వృధా కాకుండా డయాలసిస్ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించేలా తమ వైద్య సేవలను కొనసాగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భానోత్ రాంబాబు, ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, టిజియంఐడిసి డిఈ, ఏఈ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, నాయకులు చిల్లా శ్రీనివాస్, పడిదల నవీన్, తాటి బిక్షం, గాలి పల్లి సరూప, ఉల్లింగ సతీష్, వరద రాంచందర్, శివరాత్రి ఎల్లయ్య, తురక విజయ్, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజులు కట్టలేక... టీసీలు రాక విద్యార్థుల చదువులకు బ్రేక్..!

- ప్రైవేట్ పాఠశాలల తీరుతో పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- టీసీ నిబంధనలపై ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి

**టేకులపల్లి, జూలై 18, ప్రజాజ్యోతి:** ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న అనేక మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులతో ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫీజుల బకాయిలు ఉన్నాయనే కారణంతో ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ (టీసీ) ఇవ్వకుండా కొందరు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిరాకరిస్తుండటంతో విద్యార్థుల చదువులు మధ్యలోనే నిలిచిపోతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు లేదా మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ గురుకుల విద్యాసంస్థలు వంటి రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించాలని భావించినా, ప్రవేశానికి టీసీ తప్పనిసరి కావడంతో అనేక మంది విద్యార్థులు అడ్మిషన్ పొందలేక ఇంటికే పరిమితమవుతున్నారని వాపోతున్నారు.కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు "ఫీజులు కట్టలేనప్పుడు ప్రైవేట్ స్కూల్లో ఎందుకు చదివించారు?", "మేము ప్రభుత్వానికి లక్షల్లో పన్నులు చెల్లిస్తున్నాం.. మా నిబంధనలే అమలు అవుతాయి" అంటూ తల్లిదండ్రులతో అవమానకరంగా మాట్లాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటువంటి వ్యాఖ్యలు ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను మరింత మానసిక వేదనకు గురిచేస్తున్నా యని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్య అనేది ప్రతి చిన్నారికి రాజ్యాంగం కల్పించిన హక్కు. విద్యార్థుల తప్పు లేకపోయినా, ఫీజుల బకాయిల పేరుతో వారి చదువుకు అడ్డంకులు సృష్టించడం వారి భవిష్యత్తును దెబ్బతీస్తోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం 8వ తరగతి వరకు టీసీ లేకుండానే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం కల్పించే అవకాశం ఉన్నప్పటికీ, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కూడా టీసీ నిబంధనను సడలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. టీసీ లేకపోయినా విద్యార్థులకు తాత్కాలికంగా ప్రవేశం కల్పించి, తరువాత అవసరమైన పత్రాలు సమర్పించే విధంగా మార్గదర్శకాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ఫీజులు చెల్లించలేని కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని టీసీ నిబంధనలపై మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# చెత్త సేకరణ పేరుతో అదనపు సెస్ ను రద్దు చేయాలి



**ఇల్లందు, జులై 18 (ప్రజా జ్యోతి)** మున్సిపల్ పరిధిలో ఇంటి పన్ను కడుతున్నప్పటికి చెత్త పన్ను ఎందుకని, చెత్త సేకరణ పేరుతో అదనపు సెస్ (సెస్) భారాన్ని మోపకుండా వెంటనే రద్దు చేయాలని 19వ వార్డు కౌన్సిలర్ పింగళి అనూహ్య నరేష్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇల్లు మున్సిపాలిటీకి చట్టబద్ధంగా ఇంటి పన్ను చెల్లిస్తున్నప్పుడు, పారిశుధ్య నిర్వహణ బాధ్యత పూర్తిగా మున్సిపాలిటీదేనని స్పష్టం చేశారు. ఇంటి పన్ను వసూలు చేస్తూ, మళ్లీ చెత్త సేకరించడానికి ఇంటికి రూ. 50, రూ. 100, రూ. 200 చొప్పున అదనంగా వసూలు చేయడం మున్సిపల్ నిబంధనలకే విరుద్ధమని విమర్శించారు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నుల డబ్బులన్నీ ఏమవుతున్నాయని, పారిశుధ్యనికి ఆ బడ్జెట్ ఎందుకు వాడటం లేదన్నారు. 24 వార్డుల్లోని పేద, మధ్యతరగతి ప్రజలపై ఇలాంటి భారాలు వేయడం న్యాయమేనా అని, పట్టణ ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసే ఈ అక్రమ వసూళ్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, ప్రజలందరితో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, న్యాయపరమైన పోరాటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# హామీలకే పరిమితమైన పెన్షన్ పెంపు.. వృద్ధుల ఆవేదనను ఆలకించరా?

- రూ.4,000 పెన్షన్ హామీని వెంటనే అమలు చేయాలి: మీసాల రాములు

**టేకులపల్లి, జూలై 18, ప్రజాజ్యోతి:** తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వృద్ధాప్య పెన్షన్ ను రూ.4,000కు పెంచుతామనే హామీ ఇప్పటికీ అమలు కాలేదని ఏజెన్సీ షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ మీసాల రాములు విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రకటించిన హామీని వెంటనే అమలు చేసి లబ్ధిదారుల ఖాతాల్లో పెంచిన పెన్షన్ జమ చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ప్రస్తుతం అందుతున్న పెన్షన్ సరిపోవడం లేదని, వృద్ధులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం మాట నిలబెట్టి రూ.4,000 పెన్షన్ ను తక్షణమే అమలు చేయాలని కోరారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి జూలై 23న కలెక్టరేట్ ముట్టడి

- రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత సహా 8 డిమాండ్లు



**టేకుల ప ల్లి, జూలై1 8 , ప్రజాజ్యోతి:** మ ధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ మ ధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శుక్రవారం టేకులపల్లి ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి సీఐటీయూ నాయకు లు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న రూ.10 వేల వేతనాన్ని రూ.26 వేలకు పెంచడం, ఈపీఎఫ్ ఈఎస్ఐ అమలు, ఉద్యోగ భద్రత, గ్యాస్ బకాయిలు, ప్రోత్సాహకాలు వెంటనే చెల్లించడం, మెనూ ఛార్జీలు పెంపు, గర్భిణీ కా ర్మికులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ప్రతి నెల సకాలంలో వేతనా లు, రూ.10 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసం రాణి, కడుగుల వీరన్న, కొట్టెమ్మ, వెంకటమ్మ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



**చర్ల, జూలై 18:(ప్రజా జ్యోతి ):**మిషన్ భగీరథ భద్రాచలం సబ్‌డివిజన్‌లో విశిష్ట సేవలందించి బదిలీపై వెళ్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) పీ. ఏసుబాబు, ఇంట్రా ఏఈ వి. రాములకు చర్ల రైతు వేదికలో శనివారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం మాట్లాడుతూ డీఈఈ పీ. ఏసుబాబు అందించిన సేవలను కొనియాడారు. ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించడంలో ఆయన విశేష కృషి చేశారని తెలిపారు.సన్మానానికి స్పందించిన డీఈఈ పీ. ఏసుబాబు మాట్లాడుతూ మిషన్ భగీరథ సిబ్బంది తనకు కుటుంబ సభ్యుల్లాంటివారని అందరూ అంకితభావంతో పనిచేశారని ఉద్యోగంలో చిన్నపాటి తప్పిదాలు సహజమేనని వాటిని సరిదిద్దుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఇంట్రా ఏఈ వి. రాము మాట్లాడుతూ చర్లలో పనిచేసిన రోజులు జీవితాంతం గుర్తుండిపోతాయని సహోద్యోగులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ ఎం. అరుణ్ కుమార్, ఇంట్రా డీఈఈ రవితేజ, ఇంట్రా ఏఈ ఉపేందర్ (దుమ్ముగూడెం), ఇంట్రా ఏఈ నారాయణరావు (భద్రాచలం), ఇరిగేషన్ ఏఈ సంపత్, ఎంపీఓ మూర్తి, చర్ల ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, సీనియర్ నాయకుడు కాపుల నాగరాజు, చర్ల మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, మండల కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలల్లోనే కృంగిన వంతెన

- నాణ్యత లోపాలపై విచారణకు సీపీఎం డిమాండ్






**చర్ల, జూలై 18:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం పూసుగుప్ప గ్రామపంచాయతీ పరిధిలోని రాటీంత వాగుపై సుమారు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించిన వంతెన ప్రారంభించి ఆరు నెలలు కూడా పూర్తికాకముందే రెండు వైపులా కృంగిపోవడాన్ని సీపీఎం మండల కమిటీ తీవ్రంగా ఖండించింది.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు మాట్లాడుతూ ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన వంతెన స్వల్ప కాలంలోనే దెబ్బతినడం నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నాయనే అనుమానాలకు తావిస్తోందని అన్నారు . కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపట్టిన పనుల్లో నిర్లక్ష్యం, అవినీతి జరిగిందా అనే కోణంలో ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి సాంకేతిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.వంతెన నిర్మాణానికి బాధ్యులైన కాంట్రాక్టర్, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, పర్యవేక్షణ చేసిన అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వంతెనను వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మండల కార్యదర్శి మచ్చా రామారావు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉయిక రామకృష్ణ, శాఖ కార్యదర్శి గుండి చిన్నబ్బి, మిచ్చి రాంబాబు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

- 44 బీజీఎల్ షెల్స్ నిర్వీర్యం





**చర్ల, జూలై 18 (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో నక్సల్స్ నిర్మూలన జరిగినప్పటికీ నక్సలైట్లు గతంలో దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని వెలికితీయడంతో పాటు ఆయా ప్రాంతాలలో భద్రత, శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడానికి భద్రతా దళాలు నిరంతరం సెర్చింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి.ఈ క్రమంలో జులై 17న కదేర్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నక్సలైట్లు వివిధ రకాల సామగ్రిని దాచిపెట్టినట్లు 133వ బెటాలియన్ బీఎస్ఎఫ్ (సోన్‌పూర్) బృందానికి ఇన్‌ఫార్మర్ ద్వారా సమాచారం అందింది. వెంటనే భద్రతా దళాల బృందం సంఘటనా స్థలానికి చేరుకుని బాంబు స్క్వాడ్ (బీడీఎస్) సహాయంతో అనుమానాస్పద ప్రాంతాన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ తనిఖీ చేసింది.తనిఖీ అనంతరం భూమిని తవ్వగా నక్సలైట్లు దాచిపెట్టిన ఆయుధాలు, మందుగుండు సామగ్రి, కమ్యూనికేషన్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వైద్య సామగ్రి, నక్సల్స్ సాహిత్యం ,ఇతర ఉపయోగకరమైన వస్తువులు భారీ మొత్తంలో లభ్యమయ్యాయి.

### »» స్వాధీనం చేసుకున్న సామగ్రి

ఒక .303 రైఫిల్, ఆరు .315 రైఫిళ్లు, ఒక 12 బోర్ గన్, రెండు బీజీఎల్ లాంచర్లు, ఒక .303 రైఫిల్ మ్యాగజైన్, 33 కార్ట్రిడ్జ్‌లు (12 బోర్), 91 హెచ్‌డీ కార్ట్రిడ్జ్‌లు, 46 రిమ్డ్ 7.62 మి.మీ తూటాలు, 9 సాధారణ 7.62 మి.మీ తూటాలు, రెండు ఈఎఫ్‌సీ తూటాలు, నాలుగు మ్యాగజైన్ పౌచ్‌లు, ఒక ఆర్ఎఫ్ డిటెక్టర్, యాంటెన్నాలు, హెలికల్ యాంటెన్నాలు, ఐడీ ఆపరేటింగ్ మెకానిజం, టార్చ్ లైట్, రైఫిల్ స్లింగ్‌లు, నక్సల్స్ యూనిఫాం, నక్సల్స్ సాహిత్యం, వైద్య సామగ్రి, పెన్‌డ్రైవ్‌లు, మెమరీ కార్డులు, గార్మిన్ జీపీఎస్, నక్సల్స్ బ్యానర్, ప్లాస్టిక్ డ్రమ్ తదితర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, 24 పెద్దవి, 20 చిన్నవి కలిపి మొత్తం 44 బీజీఎల్ షెల్స్‌ను గుర్తించిన బాంబు స్క్వాడ్ భద్రతా కారణాల దృష్ట్యా సంఘటనా స్థలంలోనే సురక్షితంగా నిర్వీర్యం చేసి ధ్వంసం చేసింది. అందువల్ల వాటిని స్వాధీనం చేసుకున్నవాటి జాబితాలో చేర్చలేదని అధికారులు తెలిపారు.స్వాధీనం చేసుకున్న మిగిలిన సామాగ్రికి సంబంధించి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని నక్సల్స్ రహిత ప్రాంతాల్లో గతంలో దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని వెలికితీసేందుకు నారాయణపూర్ పోలీసులు, భద్రతా దళాలు నిరంతరం సెర్చింగ్ ఆపరేషన్లు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ఎల్ నినో ప్రభావం.. వరి సాగుపై పునరాలోచించండి

- ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి: కేవీకే, వ్యవసాయ శాఖ సూచన



**బూర్గంపాడు, జూలై 18,(ప్రజా జ్యోతి ):** ఎల్ నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఈ ఖరీఫ్‌లో వరి సాగుకు దూరంగా ఉండాలని, స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మండలంలోని సోంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి పొలంలో పచ్చిరొట్ట ఎరువులను కలియదున్నే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు అనంతరం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పచ్చిరొట్ట ఎరువులను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రీయ కర్బనం పెరిగి నేల సారవంతం కావడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు కూడా తక్కువగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల కంటే కంది, పెసర, బొబ్బర్లు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భరత్, వ్యవసాయ శాఖ ఏడీఏ తాతారావు, ఏవో శంకర్, ఏఈఓలు పవన్, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## మనుబోతులపాడు ఘటనపై జేఏసీ నిరసన



**చర్ల, జూలై 18(ప్రజా జ్యోతి ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మనుబోతులపాడు గ్రామపంచాయతీ పరిధిలోని వేములూరు గ్రామంలో పోడు భూముల వివాదం నేపథ్యంలో ఆదివాసీ మహిళలపై జరిగిన దాడి ఘటనను ఖండిస్తూ, సంబంధిత అటవీ అధికారులపై కఠిన చర్యలు తీసుకుని వారిని విధుల నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది.చర్ల మండల కేంద్రంలోని తుడుందెబ్బ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన జేఏసీ సమావేశంలో చైర్మన్ వాసం ముసలయ్య మాట్లాడుతూ దశాబ్దాలుగా సాగు చేస్తున్న పోడు భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో అటవీ అధికారులు వ్యవహరించిన తీరు తీవ్ర అభ్యంతరకరమన్నారు. ఈ ఘటనలో ఆరుగురు ఆదివాసీ మహిళలు గాయపడినట్లు పేర్కొంటూ, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే ఈ ఘటనను జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, తెలంగాణ ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్ స్వయంగా (సుమోటోగా) పరిగణనలోకి తీసుకుని విచారణ చేపట్టాలని కోరారు. షెడ్యూల్ ఏరియా చట్టాలపై అవగాహన లేని అధికారులను వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పోడు భూములపై దాడులు, భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను ఆదివాసీ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తాయని జిల్లాలో ఎక్కడైనా ఆదివాసులపై అన్యాయం జరిగితే వారి పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పోడు భూములకు సర్వే నిర్వహించి అర్హులైన రైతులకు వెంటనే పట్టాలు మంజూరు చేయడంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకుడు సరేం సమ్మయ్య, జేఏసీ సీనియర్ నాయకులు తాటి రామకృష్ణ, సోయం రాజారావు, పున్నం రామకృష్ణ, ఇర్పా రాజుదొర, ఇర్పా ప్రకాశ్ దొర, పూనెం వరప్రసాద్, కారం నరేష్, కంగాల అభిరామ్, తాటి వెంకటరావు, శ్యామల తరుణ్, కోరం భిక్షపతి, పూనెం రవికిరణ్, మహిళా నాయకులు ఇర్పా అపర్ణ, బీరబోయిన రాణి తదితరులు పాల్గొన్నారు.

# బార్ కౌన్సిల్ కార్యదర్శిని కలిసిన దమ్మపేట బార్ ప్రతినిధులు

- న్యాయవాదుల సంక్షేమంపై సానుకూల హామీ



**దమ్మపేట, జూలై 18(ప్రజాజ్యోతి):** దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి లక్కినేని నరేంద్రబాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు తాము బాలరాజు, తీర్నతి సంజయ్‌లు తెలంగాణ బార్ కౌన్సిల్ కార్యదర్శి నాగలక్ష్మిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా కొత్తగా వృత్తిలోకి వచ్చిన న్యాయవాదుల ఓటు నమోదు, అడ్వకేట్ హెల్త్ కార్డుల జారీ, సంక్షేమ పథకాల అమలు, బార్ కౌన్సిల్ ద్వారా అందించే సేవలను మరింత విస్తరించే అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్ మాట్లాడుతూ బార్ సభ్యుల వినతిపై బార్ కౌన్సిల్ కార్యదర్శి నాగలక్ష్మి సానుకూలంగా స్పందించారని,బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్నిక పూర్తైన అనంతరం దమ్మపేట కోర్టు, దమ్మపేట బార్ అసోసియేషన్‌కు అవసరమైన అన్ని విషయాల్లో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని , దమ్మపేట బార్ అసోసియేషన్ అభివృద్ధికి, న్యాయవాదుల సంక్షేమానికి అవసరమైన ప్రతి అంశంలో బార్ కౌన్సిల్ సహకారం ఉంటుందని ఆమె భరోసా ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి లక్కినేని నరేంద్రబాబు, న్యాయవాదులు తాము బాలరాజు, తీర్నతి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో నాటు బాంబుల తయారీ కలకలం

- హోల్ సేల్ క్రాకర్స్ షాపులో పేలుడు పదార్థాల తయారీపై తీవ్ర ఆరోపణలు.
- వ్యాపారానికే అనుమతి.. తయారీకి కాదు.
- విచారణలో నిబంధనల ఉల్లంఘన తేలితే షాప్ సీజ్ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.
- పాల్వంచ పట్టణ ఎస్సై నాగరాజు.



**పాల్వంచ, జూలై 18, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర క్రాకర్స్ దుకాణంలో నాటు బాంబుల తయారీ జరుగుతోందన్న సమాచారం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. హోల్ సేల్ బాణాసంచా విక్రయాలకు మాత్రమే అనుమతులు ఉన్న దుకాణంలో పేలుడు పదార్థాల తయారీ జరుగుతోందనే ఆరోపణలు రావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.స్థానికుల కథనం ప్రకారం, తెలంగాణ రాష్ట్రంలో బాణాసంచా తయారీకి కఠిన నిబంధనలు అమలులో ఉండగా, కేవలం వ్యాపారానికి మాత్రమే అనుమతి పొందిన దుకాణంలో నాటు బాంబుల తయారీ జరుగుతోందని ప్రచారం జరుగుతోంది. దీనిపై సంబంధిత శాఖలు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.దుకాణానికి సంబంధించిన అనుమతులు నిబంధనల ప్రకారమే మంజూరయ్యాయా..? పేలుడు పదార్థాల తయారీకి ప్రత్యేక లైసెన్సులు ఉన్నాయా..? భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా..? అనే అంశాలపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.అటవీ ప్రాంతానికి ఆనుకొని, జనావాసాల మధ్య ఇలాంటి కార్యకలాపాలు జరిగితే ఎలాంటి ప్రమాదం జరిగినా భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల ఈ వ్యవహారాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి అన్ని సంబంధిత శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని వారు కోరుతున్నారు.

**››› // వ్యాపారానికే అనుమతి, తయారీకి కాదు.. //**

ఈ అంశంపై పాల్వంచ పట్టణ ఎస్సై నాగరాజు స్పందిస్తూ శ్రీ వెంకటేశ్వర క్రాకర్స్ కు కేవలం బాణాసంచా విక్రయాల నిర్వహణకు మాత్రమే అనుమతులు ఉన్నాయని, అక్కడ ఎలాంటి క్రాకర్స్ తయారీకి లేదా పేలుడు పదార్థాల తయారీకి అనుమతులు లేవని, తాము ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ వేపడతామని, తనిఖీల్లో నాటు మందుగుండు సామగ్రి లేదా నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాల తయారీ జరుగుతున్నట్లు తేలితే వెంటనే దుకాణాన్ని సీజ్ చేసి, నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**››› // అధికారుల చర్యలపై సర్వత్రా ఆసక్తి //**

పోలీసుల ప్రకటనతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాత సంబంధిత శాఖలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయనే దానిపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులెవ్వరినీ ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బాలాజీ ఆలయంలో వైభవంగా కల్యాణోత్సవం

- చిలుకూరు ఉపేందర్ రెడ్డి–సరోజిని దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం





**అన్నపురెడ్డిపల్లి, జూలై 18 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతి శనివారం నిర్వహించే కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ మేనేజర్ పి.వి. రమణ పర్యవేక్షణలో అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.కొత్తగూడెం వాస్తవ్యులు పాలడుగు నరేష్–పవిత్ర దంపతులు స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్ స్వర్ణ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం రాజాపురం వాస్తవ్యులు చిలుకూరు ఉపేందర్ రెడ్డి–సరోజిని దంపతులు అన్నదానం ఏర్పాటు చేసి ఆలయానికి విచ్చేసిన భక్తులకు వడ్డించారు. స్వామివారి కల్యాణోత్సవం, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో సందడిగా మారింది.

## గంజాయి సేవించిన ముగ్గురిపై కేసు నమోదు

- పాల్వంచలో వాహన తనిఖీల సందర్భంగా పట్టుకున్న పోలీసులు
- వైద్య పరీక్షల్లో టీ హెచ్ సి పాజిటివ్

**పాల్వంచ, జూలై 18, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవించిన ముగ్గురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.గౌరవ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం (18-07-2026) ఉదయం పాల్వంచ టౌన్ పోలీసులు శ్రీనివాసనగర్ కాలనీ పరిసర ప్రాంతంలో వాహన తనిఖీలు, పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బ్రిడ్జి సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో వారు గంజాయి సేవించినట్లు అంగీకరించారు. అనంతరం పంచుల సమక్షంలో చట్టబద్ధమైన విధానాలను అనుసరించి పంచనామా నిర్వహించారు. తర్వాత వారిని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి యూరిన్ (టీ హెచ్ సి) పరీక్షలు నిర్వహించగా ముగ్గురికీ గంజాయి వినియోగించినట్లు నిర్ధారించే విధంగా టీ హెచ్ సి పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు వెల్లడించారు.

**››› పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితులు:**

**★ సంగ సాయి (23), పెయింటర్, గొల్లగూడెం, పాల్వంచ.**
**★ సంగేలియ గాంధీ (24), జయమ్మ కాలనీ, పాల్వంచ.**
**★ జర్పుల అశోక్ (20), కూలీ, సీతారాంపట్నం, పాల్వంచ.**

ఈ ఘటనపై పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అలాగే నిందితులను డీ-అడిక్షన్ కేంద్రానికి తరలించే చర్యలు కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు.పాల్వంచ టౌన్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు.యువత మాదకద్రవ్యాలకు పూర్తి గా దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ కు విన్నపం

- బొమ్మెర శ్రీనివాస్



**కొత్తగూడెం టౌన్, జూలై 18 ( ప్రజాజ్యోతి )** ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల అభివృద్ధి సంక్షోభంలో పడింది కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ బృందం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పీసీసీ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను శనివారం హైదరాబాద్ ఆయన నివాసములో కలిసి వినతి పత్రం అందజేశారు.అనంతరం మానుకొండూరు ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్సీ డెవలప్మెంట్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ,ఆలంపూర్ ఎమ్మెల్యే సంపత్ కుమార్ లకు వినతి పత్రాలు అందజేశారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్రంలో సగం భూభాగం ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు స్థానికంగా రిజర్వేషన్ తొలగించి జనరల్ లో కలిపినందున తీరని అన్యాయం జరిగిందని తెలియజేశారు.రాజకీయ రిజర్వేషన్ తో పాటు తరతరాల సాగుభూములకు, స్థానిక ఉద్యోగ నియామకాలు లేకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల అభివృద్ధి సంక్షోభంలో పడిందని వాపోయారు.స్పందించిన పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడుత పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు లెటర్ రాస్తా కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కార మార్గం చూపుతుందని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోద రమేష్,రాష్ట్ర కన్వీనర్ దుర్గం నగేష్,కుమ్మరి మహేందర్ తదితరులు ఉన్నారు.

## నీట్‌లో ప్రతిభ చాటిన మోడెం మేఘన




**బూర్గం పహాడ్,జూలై 18,(ప్రజా జ్యోతి):** కష్టపడే తత్వం, పట్టుదల ఉంటే ఆర్థిక ఇబ్బందులు విజయానికి అడ్డుకావని మరోసారి నిరూపించింది బూర్గం పహాడ్ మండల పరిధిలోని మోతెపట్టినగర్ కి చెందిన మోడెం మేఘన. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంది.కాగా మేఘన తల్లిదండ్రులు మోడెం వెంకటేశ్వర్లు, వెంకటరమణ నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ, ఆర్థిక పరిస్థితులను అధిగమించి చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకుని నిరంతర శ్రమతో ఈ విజయాన్ని సాధించింది.మేఘన పదో తరగతిని సారపాకలోని ఎంఎస్ఆర్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాలతో పూర్తి చేసింది. అనంతరం భద్రాచలంలోని లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి అత్యధిక మార్కులు సాధించింది. అదే క్రమశిక్షణతో నీట్ పరీక్షకు సిద్ధమై విశేష ప్రతిభ కనబరిచింది.మేఘన విజయంపై కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా సేవలందించాలని ఆకాంక్షిస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు. మేఘన విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

## శ్రీ రాగా పాఠశాల అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

**కొత్తగూడెం టౌన్, జూలై 18 ( ప్రజాజ్యోతి )**కొత్తగూడెంలోని శ్రీ రాగా పాఠశాలలో విద్యాశాఖ నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పిడిఎస్‌యూ, పిడిఎస్‌యూ సంఘాల ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ (ఏడీ) శంభు ప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బి. వీరభద్రం, జిల్లా కార్యదర్శి దుర్గం ప్రణయ్ మాట్లాడుతూ, చట్టాలు, నిబంధనలు సామాన్య ప్రజలకేనా? లేక ప్రైవేట్ విద్యా వ్యాపార సంస్థలకు వర్తించవా? అనే ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత 3 సంవత్సరాలుగా చట్టబద్ధమైన షిఫ్టింగ్ అనుమతి లేకుండానే పాఠశాల కొనసాగుతోందనీ, సంబంధిత అధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. షిఫ్టింగ్ కు కనీస అవసరమైన రిజిస్టర్డ్ లీజ్ డీడ్ బిల్డింగ్ ఓనర్ నుండి లేకుండా షిఫ్టింగ్ దరఖాస్తు ప్రాసెసింగ్ లో ఉందని అధికారులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. విద్య అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అనీ, దానిని కొందరు ప్రైవేట్ యాజమాన్యాలు లాభాల కోసం వ్యాపారంగా మార్చి, నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం అత్యంత ప్రమాదకరమని అన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు, విద్యార్థుల భద్రత మరియు విద్యా ప్రమాణాలపై నిర్లక్ష్యం వంటి అంశాలు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పేర్కొన్నారు.అదేవిధంగా, కొంతమంది విద్యార్థులు మత్తు పదార్థాల ప్రభావానికి గురవుతున్నారనీ ఇది అత్యంత ఆందోళనకరమని, ఈ అంశంపై వాస్తవాలను వెలికితీసేలా సంబంధిత శాఖలతో కలిసి నిష్పాక్షిక విచారణ నిర్వహించాలని కోరారు. అలాగే అక్రమ పాఠ్యపుస్తకాల విక్రయాలు, యూనిఫాంల అమ్మకాలు, అనుమతులు లేకుండా హాస్టల్ నిర్వహణ జరుగుతోందనే ఆరోపణలను కూడా సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖ తన బాధ్యతను నిర్వర్తించి పాఠశాల గుర్తింపు, షిఫ్టింగ్ అనుమతులు, ఉపాధ్యాయుల అర్హతలు, భద్రతా ప్రమాణాలు, ఫీజుల వసూళ్లు, హాస్టల్ నిర్వహణ తదితర అంశాలపై పారదర్శక విచారణ జరిపి నివేదికను ప్రజలకు వెల్లడించాలని సంఘాలు కోరాయి.విచారణలో ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం మరియు విద్యాశాఖను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలోఅరుణ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. విప్లవాభినందనలతో బి. వీరభద్రం పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు 9492930835



# ప్రజల జేబులకు చిల్లు పడుతుందా!

- మాంసాహార షాపులపై అధికారుల కొరడా
- తూకాలలో మోసాలపై నజర్
- తూకాలలో ప్రజలను మోసం చేస్తే కఠిన చర్యలు
- కిలోకి సుమారుగా 200 గ్రాముల కోత?
- ప్రజలకు అనుమానం వస్తే సమాచారం ఇవ్వాలని సూచన
- ప్రతి షాపులో ఇదే తంతు కొనసాగుతుందన్న అనుమానాలు
- కొలతలతో ప్రజలకు శఠగోపమా!
- అన్ని షాపులలో తనిఖీలు చేపట్టరూ!
- నష్టపోతున్న ప్రజలు..
- ఆర్థికంగా బలోపేతమవుతున్న వ్యాపారులు
- తూనికలు, కొలతల అధికారులు మరింత దృష్టి సారించరూ!








**ఇల్లందు, జులై 18 (ప్రజా జ్యోతి)** పట్టణంలోని చికెన్, మటన్, చేపలతో పాటు ఇతర మాంసాహార విక్రయ దుకాణాల్లో తక్కువ తూకం వేస్తున్నారనే ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. దింతో ప్రజల జేబులకు చెల్లెలు పడుతున్నాయని తెలుస్తుంది. వినియోగదారులను మోసం చేసే వ్యాపారులపై ప్రత్యేక నిఘా పెట్టిన అధికారులు త్వరలో విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా తూనికలు వినియోగించడం, ధృవీకరణ గడువు ముగిసిన యంత్రాలతో వ్యాపారం నిర్వహించడం, తక్కువ తూకం వేసి అధిక ధరలు వసూలు చేయడం వంటి అక్రమాలు బయటపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### ››› కిలోకు 200 గ్రాముల వరకు కోత..?

పట్టణంలో కొన్ని మాంసాహార దుకాణాల్లో కిలోకు 100 నుంచి 200 గ్రాముల వరకు తక్కువ తూకం వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తూకం యంత్రాల్లో సాంకేతిక మార్పులు చేసి వినియోగదారులను మోసం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› ప్రతి షాపులో ఇదే తంతు..?

కొన్ని ప్రాంతాల్లో ఒకటి కాదు, అనేక మాంసాహార దుకాణాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ››› కొలతలతో ప్రజలకు శఠగోపమా..!

వినియోగదారులు చెల్లించిన మొత్తానికి సరిపడా తూకం ఇవ్వకుండా వినియోగదారులకు నష్టం కలిగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ధృవీకరించిన తూనికలు వినియోగించకుండా కొందరు వ్యాపారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని తెలుస్తుంది.

### ››› అన్ని షాపుల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టరూ!

కాటాలలో తేడా అనేది కొద్దిమంది వ్యాపారులకే పరిమితం కాకుండా పట్టణంలోని అన్ని చికెన్, మటన్, చేప ల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు, లైసెన్స్ రద్దు వంటి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ››› నష్టపోతున్న సామాన్య ప్రజలు

రోజూ మాంసాహారం కొనుగోలు చేసే వినియోగదారులు తక్కువ తూకం కారణంగా ఆర్థికంగా నష్టపోతున్నారు. ఒక్కోసారి తక్కువగా కనిపించినా, మొత్తం మీద ప్రజలకు భారీ నష్టం జరుగుతోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› ఆర్థికంగా బలోపేతమవుతున్న వ్యాపారులు

తక్కువ తూకంతో అధిక లాభాలు పొందుతున్న కొందరు వ్యాపారులు అక్రమంగా ఆర్థికంగా బలోపేతమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిజాయితీగా వ్యాపారం చేసే వారికీ ఇలాంటి చర్యల వల్ల చెడ్డపేరు వస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### ››› అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి

తూకంపై అనుమానం కలిగితే వెంటనే తూనికలు, కొలతల శాఖ అధికారులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు. ఫిర్యాదుల ఆధారంగా వెంటనే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### ››› అన్ని షాపులలో ఆకస్మిక తనిఖీలు చేపట్టరూ

పట్టణంలో మాంసహార షాపులనే కాకుండా అన్ని రకాల దుకాణాలలో సంబంధిత తూనికలు, కోలతల శాఖ అధికారులు ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు చేసి ప్రజల జేబులకు చిల్లులు పడేలా వ్యవహరిస్తున్న వ్యాపారులపై కొరడా ఝులిపించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చూసుకోని తూకాలలో కోతలు పెడుతూ వినియోగదారులను ఆర్థికంగా దోచుకుంటున్నారని సమాచారం. ఇలాంటి వారిపట్ల సంబంధిత శాఖ అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజలందరూ ముక్తకంఠంతో కోరుతున్నారు.

### ››› తూనికలు, కొలతల శాఖ మరింత దృష్టి సారించాలి

పండుగలు, వారాంతాలు, ప్రత్యేక సందర్భాల్లో మాంసాహార విక్రయాలు అధికంగా జరిగే సమయంలో తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి తూకం యంత్రాన్ని పరిశీలించి, నిబంధనలు పాటించని దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటేనే వినియోగదారులకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## పామ్ ఆయిల్ గెలల దొంగతనానికి పాల్పడిన నలుగురు అరెస్ట్

- మైనర్‌తో పాటు ముగ్గురు నిందితులు అదుపులోకి

**దమ్మపేట, జూలై 18(ప్రజాజ్యోతి):** పామ్ ఆయిల్ తోటల నుంచి గెలలను దొంగతనం చేసిన కేసును దమ్మపేట పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారాన్ని విశ్లేషించి నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఒక చట్టవిరుద్ధ చర్యలో ప్రమేయం ఉన్న బాలుడు తో పాటు మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. కేసుకు సంబంధించిన ఇతర నిందితుల పాత్రపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.అరెస్ట్ అయిన వారిలో రేగుల వంశీ (16) అనే బాలుడు, పాగి రాజేష్ అలియాస్ సంజు (24), కుసిని వసంతరావు అలియాస్ వసంత్ (30) వట్టి వెంకట్రావు (41). ఉన్నారు. నిందితులను విచారిస్తున్నామని, ఈ దొంగతనానికి సంబంధించి మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు ఉన్నందున వారి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు. పామ్ ఆయిల్ రైతుల కష్టార్జిత పంటపై కన్నేసి దొంగతనాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.వ్యవసాయ ఉత్పత్తుల దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, పామ్ ఆయిల్ తోటలు లేదా ఇతర వ్యవసాయ భూముల వద్ద అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని దమ్మపేట పోలీసులు రైతులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సేవలు అభినందనీయం

- రెండు రాష్ట్రాల ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు: పున్నం చంద్

**బూర్గంపహాడ్,జూలై18, (ప్రజాజ్యోతి):** బూర్గంపహాడ్ మండల కేంద్ర ప్రభు త్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని భ ద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ రైతు కూలీ సం ఘం కార్యదర్శి డి. పున్నం చంద్ తెలిపారు. శనివా రం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లా డుతూ, రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఈ ఆసుపత్రికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాం తాల నుంచి నిత్యం సుమారు 200–250 మంది ఔట్ పేషెంట్లు వైద్య సేవల కోసం వస్తున్నారని చెప్పారు.షుగర్, రక్తపోటు బాధితులకు చికిత్సతో పాటు రక్త పరీక్షలు తదితర సేవలు కూడా నిరంతరంగా అందుతున్నాయని పేర్కొన్నారు. పురాతన ఆసుపత్రి అయినప్పటికీ వైద్యులు, సిబ్బంది 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు.ఆసుపత్రి నూతన భవన నిర్మాణం కొనసాగుతోందని, రోజుకు 30–50 మంది వరకు ఇన్ పేషెంట్లు కూడా చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కలిసి కృషి చేయాలని పున్నం చంద్ విజ్ఞప్తి చేశారు.

జూలై 3నే కేసు మొదలైందా..? లేక అప్పుడే మరో పరిణామానికి తెర లేచిందా..?

ఫిర్యాదు నమోదు కాక ముందు జరిగిన ప్రతి పరిణామంపై ఇంకా ప్రశ్నలే..!

మధ్యలో జరిగిన సంప్రదింపులు, స్టేషన్‌లో జరిగిన చర్చలపై స్పష్టత ఎక్కడ..?

మధ్యవర్తుల ప్రమేయం గురించి పోలీసుల వద్ద నిజంగా ఆధారాలు లేవా..?

నిజంగా 11 వ తారిఖు కంటే ముందు ఈ విషయం పోలీసులకు తెలియదా..?

ప్రెస్ మీట్‌లో చెప్పిన వివరాలకు ముందు జరిగిన కాలక్రమం ఏమిటి..?

సీసీటీవీ, సీడీఆర్, స్టేషన్ రికార్డులు అసలు నిజాన్ని చెబుతాయా..?

పూర్తి టైమ్‌లైన్‌ను బయటపెట్టాలని ప్రజల డిమాండ్..!




# 2 టౌన్ స్టేషన్ సాక్షిగా...

# అసలేం జరిగింది..?

జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కొత్తగూడెం టూ టౌన్ పోక్సో కేసు రోజురోజుకూ కొత్త ప్రశ్నలకు దారితీస్తోంది. బాధితురాలి తల్లి ఫిర్యాదు ఆధారంగానే కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టామని పోలీసులు చెబుతున్నప్పటికీ, ఫిర్యాదు నమోదుకు ముందు జరిగిన పరిణామాలపై మాత్రం ఇంకా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, పోక్సో చట్టం ప్రకారం చిన్నారిపై జరిగిన లైంగిక నేరాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం, రాజీకి ప్రయత్నించడం లేదా న్యాయ ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలు కూడా చట్టపరమైన పరిణామాలకు దారితీయవచ్చని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తండ్రి లేని ఓ మైనర్ బాలికకు జరిగిన అన్యాయాన్ని ఓ ప్రభుద్దుడు వెలకట్టే ప్రయత్నాలు చేశాడని..? అలాంటి ప్రయత్నాల్లో మరికొందరు కూడా పాత్ర పోషించారాని..? ఇందులో ప్రధానంగా బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తుల ప్రమేయం కూడా ఉందని వినిపిస్తున్న సందేహాలకు దర్యాప్తు ద్వారా సమాధానం దొరుకుతుందా? అనే చర్చ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రజల్లో వినిపిస్తున్న ప్రశ్నలు, దర్యాప్తుతో తేలాల్సిన అంశాలపై ప్రత్యేక కథనం.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### ప్రణాళిక సిద్ధం చేసిన 'సత్య ప్రకాశు'డు..?

ప్రెస్ మీట్‌లో పోలీసులు వెల్లడించినట్టు ఈ కేసుకు స్టార్టింగ్ పాయింట్ జూలై 3వ తేదీనే.. ఆ తేదీనే చిన్నారి పై మొదటిసారి అఘాయిత్యం జరిగిన తేదీగా పోలీసులు పేర్కొంటున్నారు. కానీ విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆ రోజు అమ్మాయి మిస్సింగ్ లో ఉందని తెలుస్తోంది. దీంతో కంగారు పడిపోయిన తల్లి ఈ నెట్ సెంటర్ నిర్వాహకుడిని సంప్రదించింది. అప్పటికే అధిక వడ్డీ వ్యాపారాలు చేస్తున్నందున ఈ 'సత్యప్రకశు'కి ఆ పరిసరప్రాంతలలో బాగా పట్టు ఉండడంతో ఎట్టకేలకు అమ్మాయి జాడను కనుగొన్నాడు. ఇక అప్పుడే అమ్మాయి ఆచుకితో పాటు అతనికి మరో విషయం తెలిసిందనే వాదన వినబడుతోంది. అంతే ఒక్కసారిగా అతనిలో ఉన్న సెటిల్మెంట్ కోణం నిద్రలేపినట్టు, దీంతో మరుసటి రోజు ఆ అమ్మయిని కూర్చోబెట్టి అసలు ఎం జరిగింది..? ఎప్పుడు జరిగింది..? ఎవరెవరు..? లాంటి ప్రశ్నలతో చిన్నారిని ఉక్కిరి బిక్కిరి చేసి అతనికి కావలసిన మొత్తం సమాచారాన్ని లాగాడని పరిసర ప్రాంతాలలో చర్చ జరుగుతోంది. సాధారంగా ఇలాంటి సంఘటణలు ఏమైనా జరిగితే ప్రతి ఒక్కరు కూడా ఆ తండ్రి లేని చిన్నారి పై జాలి పడి నిందితులను జైలు పాలు చెయ్యాలని చూస్తారు. కానీ ఈ నెట్ సెంటర్ నిర్వాహకుడు మాత్రం దీనిపై లక్షల రూపాయలు రాబట్టాలని చూసిండని పలువురు ఆరోపిస్తున్నారు. అంతే ఇక అక్కడితో తన రాయబారుల్ని సిద్ధం చేసుకొని, వాళ్ళతో అదే రోజు (4 వ తారిఖు) కోర్చోని ఎలా ముందుకు వేళ్ళలో ఓ ప్రణాళిక సిద్ధం చేసుకున్నాట్టు సమాచారం.

### నెట్ సెంటర్ నిర్వాహకుడి

### ఇంటికి నిందుతుల కుటుంభం..?

ఇక తదుపరి రోజు (5 వ తారీకు) తన కార్యాచరణను మొదలు పెట్టిన్నట్టు తెలుస్తోంది. కాని అదే పోలీసుల కథనం ప్రకారం ఐదవ తారీఖు నాడు చివరి అఘాయిత్యం జరిగిందని పేర్కొన్నారు. అయితే నిజంగానే 5 వ తేదీ చివరి అఘాయిత్యానికి సంబంధించిన తేదీ కాదని, నిందితులను భయపెడుతూ రాజి వ్యవహారానికి బీజం పడిన తొలి రోజని పలువురు పేర్కొంటున్నారు. ఆరోజే ఈ నెట్ సెంటర్ నిర్వాహకుడు అతనికి సంబంధించిన అనుచరుల ద్వారా ఈ విషయం నిందితులకు చేరవేసిన్నట్టు తెలుస్తోంది. బాదితులు పోలిస్ స్టేషన్ కు వెళ్లేందుకు సిద్దంగా ఉన్నారని, తొందరగా వచ్చి సెటిల్మెంట్ చేసుకోవాలని హుకుం జారి చేసిన్నట్టు బహిరంగ చర్చ నడుస్తోంది. కానీ ఆ రోజు ఈ విషయాన్ని నిందుతులుగా ఆరోపించాబడుతున్న యువకులు అంతగా స్పందించ లేదని సమాచారం. దీంతో మరో వ్యక్తి తదుపరి రోజు (6వ తారీకు) వాళ్ళ కుటుంబాలకు సమాచారం చేరేలా ఈ 'సత్యప్రకాశు'డి ప్రయత్నాలు జరిగాయని విస్తృతంగా చర్చించుకుంటున్నారు. అప్పుడు ఈ విషయం తెలిసిన నిందితుల కుటుంబీకులు ఎలా రియాక్ట్ అవ్వాలో అర్ధం కాలేదని, దీంతో ఇక ఏం చేయాలో తెలియక నిందితుల కుటుంబ సభ్యులు జూలై 7వ తేదీనే సుమారు ఉదయం 11 గంటల ప్రాంతము లో ఆ నెట్ సెంటర్ నిర్వాహకుడి ఇంటికి వెళ్లినట్టు ప్రాథమిక సమాచారం అందుతోంది. అయితే అక్కడ వాళ్ళ వేదనను చెప్పుకొని కాళ్ళ ఏళ్ల పడి ఇతగాడిని వేడుకున్నారా..? ఆ రోజు అక్కడ ఎలాంటి చర్చ జరిగింది..? ఇతగాడికి అనుకున్న స్థాయిలో సెటిల్మెంట్ జరగకపోవడంతో ఇక అతని వెకిలి చేష్టల విశ్వరూపం చూపించేందుకు పూనుకున్నాడా..? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తున్నాయి.

### 8, 9 తేదిలలో.. పోలిస్ స్టేషన్ సాక్షిగా..?

ఇక ఏడో తారీఖు తాను అనుకున్న స్థాయిలో చర్చలు ఫలించకపోవడంతో జూలై 8న బాధితురాలి తల్లిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్టు స్థానికంగా వినిపిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఇక ఆ రోజు నుండే అనధికారికంగా పోలీస్ సిబ్బంది ఇందులో ఇన్వాల్వ్ అయ్యారని పలు వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే అదే రోజు నిందితులకు ఓ అధికారి ఆదేశంతో పోలీస్ సిబ్బంది ఫోన్ చేసినట్టు సమాచారం. ఇక ఆరోజు అటు పక్క నుండి ఎలాంటి రెస్పాండ్ లేకపోవడంతో జూలై 9న మళ్లీ పోలీస్ స్టేషన్ కేంద్రంగా సంప్రదింపుల ప్రయత్నాలు జరిగాయని, మరోసారి నిందితులకు ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం జరిగిందని చర్చ సాగుతోంది. ఇక కానిస్టేబుల్ స్థాయి సిబ్బందితో స్పందన రాకపోవడంతో నేరుగా ఓ అధికారి ద్వారా సంప్రదించారని, అప్పటికి కూడా అటు నుంచి సమాధానం రాకపోవడంతో ఈ బృందం అంతా కూడా కొంత ఆందోళన చెందినట్టు తెలుస్తోంది. తదుపరిగా ఏం చేయాలో తెలియని సందిగ్ధతలో ఉన్నప్పుడు.. అదే రోజు నిందితుల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆవు పోయిందని ఫిర్యాదుకై పోలీస్ స్టేషన్ కు వచ్చినట్టు సంమచారం. అప్పుడు అతనికి ఒక ఫోటో చూపించి.. ఈ వ్యక్తి మీకు తెలుసా? అని ఈ మధ్యవర్తి అతనిని ప్రశ్నించడని, అతను తెలుసు అని సమాధానం ఇవ్వగానే ఆ మధ్యవర్తి అతనిపై ప్రశ్నల వర్షం కురిపించిన్నట్టు తెలుస్తోంది.

### వీటికి సమాధానం ఆ అధి

### కారే చెప్పాలి..?

ఇక అంతలోనే స్టేషన్ లోపల తన క్యాబిన్ నుండి బయటికి వచ్చిన మరో అధికారికి ఈ మధ్యవర్తి ఏమని సూచించాడు..? అప్పుడు ఆ వ్యక్తితో ఈ అధికారి ఏమని సందేశం పంపించాడు..? నిజంగా అలాంటి సంఘటన జరిగి ఉంటే దాని ఉద్దేశం ఏమిటి..? ఇందులో ఎంత వరకు నిజం ఉంది..? దీనిపై పోలీసులు స్పష్టత ఇస్తారా..? జూలై 10న ముఖ్యమంత్రి సభ బందోబస్తు కారణంగా ఈ అంశాన్ని పక్కన పెట్టారా..? ఇక లాభం లేదని జూలై 11 న ప్రత్యేక వాహనంలో పోలీసులు గ్రామానికి వెళ్లారనే సమాచారం నిజమేనా..? ఆ పర్యటన ఉద్దేశం ఏమిటి..? అయితే అసలు పోలీసులు చెప్పినట్టుగా బాధితురాలి తల్లి తొలిసారిగా జూలై 11న మాత్రమే స్టేషన్‌కు వెళ్లారా..? పోలీసులకు కూడా నిజంగా అదే రోజు విషయం తెలుసా..? ఇదే నిజమైతే ఫిర్యాదు నమోదుకు ముందు పోలిస్ స్టేషన్ సాక్షిగా 8, 9 తారికులలో జరిగిన ప్రతి పరిణామంపై పూర్తి కాలక్రమాన్ని పోలీసులు వెల్లడిస్తారా..? ఇందులో ఆటు కానిస్టేబుల్ నుండి జరిగిన లావాదేవీలు ఎంత..? ఈ అయిదుగురు నిందితులలో ఇద్దరు ఇచ్చుకున్నదేంత..? అసలు ఈ ఘటనకు ఆరంభం ఆటో డ్రైవర్ నవీన్ తో పరిచయమే.. అలాంటప్పుడు అసలు మొదటి మూడు రోజులు ఎఫ్ ఐ ర్ లో అతని పేరు ఎందుకు లేదు..? ఈ ప్రశ్నలకు సమాధానం దొరికితేనే ఫిర్యాదు నమోదుకు ముందు అసలేం జరిగింది..? మధ్యలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి..? అనే అంశాలపై ప్రజల్లో ఉన్న సందేహాలకు తెరపడే అవకాశం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. మరి ఇందులో వాస్తవ, అవాస్తవాలు ఏమిటి అన్నది.. జిల్లా పోలీస్ బాస్ విచారణకు ఆదేశిస్తేనే బయటపడుతుందని కొత్తగూడెం ప్రజానీకం అంటోంది.

## ఏ ఆధారాలు లభించినా చర్యలు తప్పవు

**ఎల్. ఆదినారాయణ (డీఎస్పీ, కొత్తగూడెం)**



"పోక్సో చట్టం ప్రకారం ఈ కేసును దాచేందుకు, రాజీ చేసేందుకు లేదా న్యాయ ప్రక్రియకు ఆటంకం కలిగించేలా ఎవరైనా ప్రయత్నించి ఉంటే వాళ్లు కూడా శిక్షార్హులే. ఈ కేసుకు సంబంధించి మొదటి నుంచి బయట కొన్ని సందేహాలు, ప్రచారాలు వినిపిస్తున్నాయి. వాటన్నింటిపైనా మేము విచారణ చేస్తున్నాం. దర్యాప్తులో ఎవరైనా రాజీ ప్రయత్నాలు చేసినట్లు లేదా చట్టవిరుద్ధంగా వ్యవహరించినట్లు ఆధారాలు లభిస్తే ఎలాంటి వ్యక్తినీ వదిలే ప్రసక్తే లేదు. చట్టం ప్రకారం తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు నమోదుకు ముందు జరిగిన పరిణామాలతో సహా ఈ కేసును అన్ని కోణాల్లో సమగ్రంగా విచారిస్తాం. విచారణలో వెలుగులోకి వచ్చే ప్రతి అంశాన్ని మా పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన తదుపరి చర్యలు తీసుకుంటాం".